క్లుప్తంగా

వేడుకగా పైడిమాలమ్మ ఆలయ ప్రతిష్ఠ



పూజల్లో పాల్గొన్న భక్తులు

తెర్లాం: మండలంలోని ఎస్.బూర్జవలస గ్రామంలో పైడిమాలమ్మ తల్లి ఆలయ ప్రతిష్ఠ కార్యక్రమం శుక్రవారం వేడుకగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక, సాంఘికకార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

నేడు ఫ్యాప్టో ధర్నా



పోలీసుస్టేషన్ రోడ్డు పాఠశాలలో ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న రామారావు

రాజాం సిటీ: ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఈ నెల 2న శనివారం కలెక్టరేట్ వద్ద చేపట్టనున్న ధర్నాను ఉపాధ్యాయులంతా విజయవంతం చేయాలని బీటీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పేకేటి రామారావు పిలుపునిచ్చారు. పట్టణంలోని పలు పాఠశాలల్లో ఉపాధ్యాయులతో శుక్రవారం సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యారంగంలో ఉపాధ్యాయు లు ఎదుర్కొంటున్న 18 డిమాండ్లతో కూడిన సమస్యలు పరిష్కారమే ధ్యేయంగా ధర్నా నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఉదయం 9గంటల నుంచి 1 గంట వరకు జరిగే ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొనాలని ఆయన కోరారు.

ఎస్ఐగా ప్రకాష్



బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ ప్రకాష్

బొబ్బిలి: పట్టణ ఎస్ఐగా ఎన్‌వీఎస్ ప్రకాష్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన విజయనగరం ఎస్పీ కార్యాలయం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ డీఎస్పీ, సీఐల సూచనలతో శాంతిభద్రతలను అదుపులో ఉంచేందుకు తగు చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

సద్వినియోగం చేసుకోవాలి

బొబ్బిలి రూరల్: నిరుపేద వితంతువులైన మహిళలకు ప్రభుత్వం ద్వారా అందుతున్న పింఛన్ సొమ్మును లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ శంబంగి లక్ష్మి సూచించారు. మండలంలోని పక్కి గ్రామంలో శుక్రవారం కొత్తగా మంజూరైన పింఛన్లను ఎంపీపీ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో ఆమె మాట్లాడుతూ పింఛన్ ద్వారా అందుతున్న నగదును పొదుపు చేసుకోవాలని, అత్యవసర పరిస్థితులు, అవసరమైన మేర ఖర్చు చేయాలని సూచించారు. నిర్భాగ్యులైన, ఇంటి పెద్దను కోల్పోయిన వారికి ఈ పింఛన్ సొమ్ము కొంతమేర ఊరటనిస్తుందని పేర్కొన్నారు. పింఛన్లను కుటుంబ అవసరాలకు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా జనరల్ సెక్రటరీ శంబంగి వేణుగోపాలనాయుడు, స్థానిక నాయకులు, లబ్ధిదారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

వంగర: మండల పరిధి మద్దివలసలో మంజూరైన స్పౌజ్ పెన్షన్లు శుక్రవారం ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ పంపిణీ చేశారు. మండలానికి 110 స్పౌజ్ పెన్షన్లు మంజూరయ్యాయని, వాటిని సచివాలయ ఉద్యోగులు ద్వారా లబ్ధిదారులకు అందించినట్లు ఆయన తెలిపారు. ప్రతి లబ్ధిదారు ఈ మొత్తాన్ని కుటుంబ ఆర్థిక అవసరాలకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రోటోకాల్ పాటించని అధికారులు

మెంటాడ: ఎవరెన్ని చెప్పినా మాకు నచ్చినట్టే చేస్తాం.. ప్రోటోకాల్ పాటించం.. మంత్రి చెప్పినా వినే సమస్యే లేదు అన్నట్టుంది ఇక్కడి పంచాయతీ కార్యదర్శి తీరు. పిలిచినట్టే పిలిచి కూర్చోడానికి కుర్చీ కూడా వేయకుండా పదవులు లేని వారితోనే పింఛన్లు పంపిణీ చేయిస్తున్న ఘటనలు ఇక్కడ జరుగుతూనే ఉన్నాయి. విషయానికొస్తే.. కొత్తగా వచ్చిన స్పౌజ్ పింఛన్ల పంపిణీకి జయతి గ్రామం ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ పొట్టంగి దుర్గను శుక్రవారం ఆహ్వానించి అవమానించారు ఇక్కడి పంచాయతీ కార్యదర్శి సి.హెచ్.రాంబాబు. మంత్రి గుమ్మడి సంధ్యారాణి ఏర్పాటు చేస్తున్న సమావేశాల్లో పదవులు ఉన్న నాయకులను తప్పకుండా పిలిచి ప్రోటోకాల్ పాటించాలని పదేపదే చెబుతున్నా.. అధికారులు మాత్రం భేఖాతరు చేస్తూ ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. వచ్చిన వైస్ ఎంపీపీకి కుర్చీ కూడా వేయకుండా కనీసం వార్డు మెంబర్లు కాని కూటమి నాయకులనే ఉన్న కుర్చీల్లో కూర్చోబెట్టారు. ఎంపీడీవో భానుమూర్తికి ఫోన్‌లో తెలియజేసినా కనీసం పట్టించుకోలేదని వైస్ ఎంపీపీ దుర్గ ఆవేదన వ్యక్తం చేశారు.

గుంతలు చెరువులవుతున్నాయ్..!

- మరమ్మతుల పేరుతో మరిన్ని గుంలు
- ప్రజలకు తప్పని అవస్థలు
- రాజా కళాశాల రోడ్డుకు అడ్డంగా బారికేడ్లు



నిత్యం రద్దీగా ఉండే రాజా కాలేజ్ రోడ్డులో ఇలాంటి గుంతలు ఎన్నో..



ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి వెళ్లే దారిని ఆటోలు, బారికేడ్లతో బంద్ చేశారిలా..

బొబ్బిలి: ఎమ్మెల్యే కాక మునుపు బేబీ నాయన బ్యానర్లు, అభిమానులతో కలసి పాదయాత్ర చేసిన రహదారిని ఇప్పుడు దాదాపు మూసి వేశారు. పోలీసులు బారికేడ్లు వేయడంతో ఇప్పుడు కేవలం ద్విచక్ర వాహనాలు, పాదచారులు మాత్రమే నడచి వెళ్లే పరిస్థితి నెలకొంది. గుంతలు పెరిగి రహదారి మరింత దారుణంగా తయారవడంతో పరిస్థితి దారుణంగా తయారైంది. గడచిన అసెంబ్లీ ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడకముందు చిన్న చిన్న గుంతలతో ఉన్న బొబ్బిలి ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి గొల్లపల్లి బైపాస్ రోడ్డు దాడితల్లి ఆలయం వరకూ ఉన్న కాలేజ్ రోడ్డును తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన వెంటనే కొత్త రహదారిని నిర్మిస్తానని అప్పట్లో హామీ ఇచ్చారు. కానీ నేటికీ కనీసం మరమ్మతులు కూడా చేయలేదు. డివిజన్ కేంద్రంలోని ప్రధాన రహదారి అయిన కాలేజ్ రోడ్డు గుంతలకు ఎవరో భవన నిర్మాణదారులు కూలగొట్టిన వ్యర్థాలతో కొన్నాళ్లు గుట్టల రహదారిలా మారిన ఈ రహదారిని మరమ్మతులు చేస్తామని చెప్పి ఎక్కడ పడితే అక్కడ ప్రొక్లెయిన్‌తో తవ్వేశారు. దీంతో ఇప్పుడు నరక యాతన అంటే ఏంటో ప్రజలకు తెలుస్తోంది. గుంతలన్నీ ఇప్పుడు చిన్న చిన్న చెరువుల్లా తయారయ్యాయి. అదేదో సినిమాలో కూజాలు సెంబులవుతున్నాయన్న డైలాగ్ మాదిరి గుంతలు కాస్తా చిన్న చిన్న చెరువులుగా మారుతుండటంతో సమీప గ్రామాల ప్రజలు బొబ్బిలి సందర్శనలు మానుకుంటున్నారని చెబుతున్నారు. ఒకప్పుడు కాలేజ్ రోడ్డులో వెళ్లాలంటే జన సమ్మర్దంతో రద్దీగా ఉండేది. కానీ ఇప్పుడు ఏదో కుగ్రామంలోని రోడ్డులా ఉందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు.

కానరాని బుడా నిధులు

వర్షాలు కురవక ముందు అంటే గడచిన వేసవికి ముందే రూ.కోటికి పైగా నిధులు మంజూరు చేశామని ప్రెస్‌మీట్ పెట్టి మరీ ఎమ్మెల్యే బేబీ నాయన, బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు ప్రకటించారు. కానీ ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. ఇటీవల కలెక్టర్ నిధులు మంజూరు చేశారనీ స్వంత నిధులు కూడా జత చేసి రోడ్డు వేస్తామని చెప్పిన బేబీ నాయన చెప్పారు. దీంతో అధికారులు రోడ్డును ఎక్కడ బడితే అక్కడ లూజు మట్టి, రోడ్డును తవ్వేశారు. ఆ తరువాత వర్షాలు కురవడంతో ఆ తవ్వకాల్లో నీరు చేరి చెరువులుగా మారుతున్నాయి. దీంతో నిత్యం విద్యార్థులు, సందర్శకులతో రద్దీగా ఉండే ఈ రహదారి ఇప్పుడు నిర్మానుష్యంగా మారింది.

తవ్వేసిన గ్రావెల్ రియల్‌ఎస్టేట్‌కు అమ్మకానికి?

పట్టణంలోని రాజా కాలేజ్ రోడ్డులో కొన్ని చోట్ల చాలా లోతుగా తవ్వకాలు జరిపారు. ఆ తవ్వకాలు జరిగిన ప్రాంతాల్లోని గ్రావెల్‌ను రియల్ ఎస్టేట్‌కు అమ్ముకున్నట్టు తెలుస్తోంది. పట్టణ శివారులోని రెండు రియల్ ఎస్టేట్‌లకు ఆ గ్రావెల్‌ను తరలించారట! వందల కొద్దీ ట్రాక్టర్లతో గ్రావెల్‌ను రాజా కాలేజ్ రోడ్డు నుంచే తరలించారట! ఈ విషయం అధికారులకూ, కూటమి నాయకులకూ తెలిసినా కానీ రోడ్డు గుంతలు, తటాకాలను మాత్రం కప్పలేదు. తవ్వేసి దాదాపు నెల రోజులు కావస్తోంది కానీ మరమ్మతు పనులు మాత్రం చేయలేదంటే ప్రయాణికుల బాధలు పడితే కదానని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ రహదారి గుండా పెద్ద నాయకుల కార్లు రావడం లేదు కూడా.

రెండు మూడు రోజుల్లో పనులు ప్రారంభిస్తాం

మరో రెండు మూడు రోజుల్లో రహదారి మరమ్మతులు ప్రారంభిస్తాం. ఎమ్మెల్యే గారి స్వంత నిధులతో పనులు చేపడుతున్నారు. వాతావరణ వెసులుబాటును చూసుకుని పనులు చేపట్టి రోడ్డు పనులు ప్రారంభిస్తాం.
– కిరణ్‌కుమార్, మున్సిపల్ డీఈఈ, బొబ్బిలి

దుకాణ దారుల అవస్థలు

రాజా కాలేజ్ రోడ్డులో ఇరువైపులా ఉన్న దుకాణదారులు ఇప్పుడు రోడ్డును తవ్వేసి వదిలేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చిన్న చిన్న రాళ్లు, చెక్కలు వేసుకుని దుకాణాలు నిర్వహిస్తున్నారు. కానీ కస్టమర్లు మాత్రం చెక్కల మీద నుంచి రాళ్ల మీద నుంచి రావడం లేదని వారు వాపోతున్నారు. త్వరగా రోడ్డును నిర్మించి కాలేజ్ రోడ్డులో మునుపటిలానే ఆటోలు, ఇతర వాహనాలతో సాఫీగా ప్రయాణం సాగేలా చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు.

జగన్ మాటంటే.. అమలు గ్యారంటీ



రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్తున్న శంబంగి

- బాబు హామీ ఇస్తే.. మోసం గ్యారంటీ
- రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టోలో శంబంగి

బొబ్బిలి: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకిచ్చిన మాట కచ్చితంగా అమలయి తీరుతుందనీ, చంద్రబాబు హామీ ఇస్తే మోసం గ్యారంటీగా చేస్తారనీ మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. పట్టణంలోని గొల్లపల్లి 12వ వార్డులో రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వార్డులో ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను చదివి వినిపించారు. ఆ కరపత్రాలను ప్రతీ ఇంటికీ పంచిపెట్టారు. ఈ హామీల్లో ఏమైనా అమలు చేశారా? మీకు లబ్ధి కలిగిందానని అడిగారు. ఏం జరిగినా వెనుక ఉన్న ఖాళీలను పూరించి ఇవ్వాలని కోరారు. శంబంగి ప్రశ్నలకు స్థానికులు మాకు ఏమీ అందలేదని బదులిచ్చారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఇచ్చినప్పటికీ అమలు చేయడంలో వెనుకాడుతున్నారన్నారు. హామీల గూర్చి అడుగుతుంటే అతను సింగపూర్ నుంచి కంపెనీలు వస్తున్నాయని, ఏకంగా రూ.45వేల కోట్ల పెట్టుబడులు వస్తున్నాయని చెప్పడం విచారకరమన్నారు. మరో పక్క మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నెల్లూరు పర్యటనకు వచ్చినప్పుడు కూటమి నాయకులు ప్రజలను రానీయకుండా అడుగడుగునా అడ్డంకులు సృష్టించారన్నారు. ఒక నాయకుడి వద్దకు ప్రజలు, అభిమానులను వెళ్లనీయకుండా రోడ్లు తవ్వేయడం, బారికేడ్లు, ముళ్లకంచెలు పెట్టడం దేశ చరిత్రలోనే లేదన్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్లు ఇంటి గోపాలరావు, ఎస్వీ మురళీకృష్ణారావు, పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు, సీనియర్ నాయకులు తూముల భాస్కరరావు, వార్డు ఇన్‌చార్జి మండల జనార్ధనరావు, పలువురు కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, వార్డు ఇన్‌చార్జిలు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవలో తేడాలొస్తే వదిలేదే లేదు



సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ రాజాం ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

- వైఎస్సార్‌సీపీ రాజాం ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

రాజాం: కూటమి ప్రభుత్వం ఏడాది కాలంగా రైతులకు అన్నదాత సుఖీభవ పేరుతో ఊరిస్తుందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజాం ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ ఆరోపించారు. శుక్రవారం రాజాంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ రోజు రేపు అంటూ అన్నదాత సుఖీభవను వాయిదా వేస్తూ వస్తుందని దుయ్యబట్టారు. గతేడాది అందాల్సిన రైతుకు ముందస్తు సాయం అందలేదని, ఈ ఏడాది కూడా ఖరీఫ్ ప్రారంభమై నెల రోజులు గడుస్తున్నా పథకాన్ని అమలు చేయలేకపోయిందని ఆరోపించారు. ఈ పథకాన్ని ఇప్పటికైనా అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ పథకంలో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇచ్చిన మాదిరిగా పార్టీలకు అతీతంగా అర్హులు అందరికీ రైతు సాయం అందించాలని డిమాండ్ చేశారు. అనర్హత పేరుతో కొర్రీలు పెట్టి, నిజమైన లబ్ధిదారున్ని విస్మరిస్తే ఊరుకునేది లేదని, బాధిత రైతులు తరపున పోరాటం చేస్తామని హెచ్చరించారు. అన్నదాత సుఖీభవలో కౌలు రైతులకు న్యాయం చేయాలని, అన్ని వర్గాల వారికీ సకాలంలో సాయం అందించాలన్నారు. ఆయన వెంట పార్టీ రాజాం రూరల్ అధ్యక్షులు లావేటి రాజగోపాలనాయుడు, జెడ్‌పీటీసీ సభ్యులు బండి నర్సింహులు, సర్పంచ్‌ల విభాగం నియోజకవర్గ కన్వీనర్ వాకముల్ల చిన్నంనాయుడు, వైస్ ఎంపీపీలు యాలాల వెంకటేష్, నక్క వర్షిణిలు, సర్పంచ్‌లు వంజరాపు విజయ్‌కుమార్, నక్క శ్రీను, గెడ్డాపు అప్పలనాయుడు, కొర్ను ఈశ్వరరావు, కామోదుల శ్రీరంగం నాయుడు తదితరులు ఉన్నారు.

రిటైర్డ్, మృతుల కుటుంబాలను ఆదుకోవాలి



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నాలో పాల్గొన్న కార్మికులు

- మున్సిపల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ధర్నా

రాజాం: రాజాం మున్సిపాల్టీలో కార్మికులుగా, కాంట్రాక్ట్ ఉద్యోగులుగా పని చేస్తూ పదవీ విరమణ చేసిన వారితో పాటు విధుల్లో ఉంటుండగా మృతి చెందిన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని, వారి కుటుంబ సభ్యులకు వెంటనే ఉద్యోగాలు కల్పించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ.జగన్మోహనరావు డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్యాలయం వద్ద ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయాస్ యూనియన్‌తో కలసి శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులుగా, కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా చాలీచాలని జీతాలతో చాలా మంది కాలం నెట్టుకొస్తున్నారని అన్నారు. వీరిలో వయస్సు పైబడి పదవీ విరమణ చేసిన వారి కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాల్సిన నిబంధన ఉన్నా పట్టించుకోవడం లేదని దుయ్యబట్టారు. మరో వైపు ఈ ఉద్యోగాలు చేస్తూ ఆకస్మికంగా మృతి చెందిన వారి కుటుంబాన్ని ఆదుకోవడంతో పాటు ఆ కుటుంబంలోని బిడ్డలకు ఉద్యోగ కల్పన చేయాలని జీవో ఉందని, ఇక్కడ మున్సిపల్ కమిషనర్ ఆ నిబంధనలు తుంగలోకి తొక్కుతున్నారని మండిపడ్డారు. రాజాం మున్సిపాల్టీ పరిధిలో పని చేస్తూ మృతి చెందిన పడాల ప్రసాద్ కుటుంబం రోడ్డున పడిందని, ఆ ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాల్సి ఉండగా, ఇక్కడ అధికారులు తాత్సరం చేస్తున్నారని ఆరోపించారు. అనంతరం మేనేజర్‌కు డిమాండ్ పత్రాన్ని అందజేశారు. సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఎం.త్రినాథ్, రాజాం మున్సిపల్ యూనియన్ నాయకులు రాజేష్, రవి, శ్రీను, కనకరాజు, దుర్గ, చినబాబు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

స్టీల్ ప్లాంట్‌ను కూటమి నాయకులు కాపాడలేరా..!

బొబ్బిలి: ఉత్తరాంధ్రకు తలమానికమయిన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ కాకుండా కూటమి నాయకులు కాపాడలేరా అని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి మువ్వల శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో శుక్రవారం మాట్లాడారు. సింగపూర్ నుంచి పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తాయంటున్న కూటమి నాయకులు ఇక్కడి పరిశ్రమను కూడా కాపాడుకోవాలన్నారు. ఐదేళ్లలో రూ.45వేల కోట్ల పెట్టుబడులతో ఒప్పందాలు చేశామని నారా లోకేష్ చెబుతున్నారని, కానీ ఇక్కడి స్టీల్‌ప్లాంట్‌గానీ, గ్రోత్ సెంటర్‌లో ఖాళీ అవుతున్న పరిశ్రమల గురించిగానీ చెప్పడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చి 14 నెలలు అవుతున్నా ఒక్క పరిశ్రమ కూడా రాలేదన్నారు. ముందు కార్యరూపం దాల్చే మాటలు ఆడాలన్నారు. ఐదేళ్ల పాటు అన్నీ వస్తున్నాయని ప్రజలు, యువతను భ్రమలో ఉంచొద్దని ఆయన హితవు పలికారు.

మిగులు సీట్లకు దరఖాస్తులు ఆహ్వానం

వంగర: మండల పరిధి మద్దువలస డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకులంలో 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగులు సీట్లు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ జంపా రాధిక శుక్రవారం తెలిపారు. 5వ తరగతిలో 44 సీట్లు, 6వ తరగతిలో 13 సీట్లు, 7వ తరగతిలో ఎనిమిది సీట్లు, 9వ తరగతిలో ఆరు సీట్లు ఖాళీలున్నాయని, అర్హులైన ఎస్సీ, ఎస్టీ విద్యార్థినిలు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

బాడంగిలో..

బాడంగి: స్థానికంగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో ఖాళీ సీట్ల భర్తీకి ఈ నెల 8వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కేవీ రమణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థులు నేరుగా పాఠశాలలో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

విద్యా రంగ పరిరక్షణే ధ్యేయం



జెండా ఆవిష్కరిస్తున్న విజయగౌరి తదితరులు

బొబ్బిలి: విద్యా రంగ పరిరక్షణే ధ్యేయంగా పని చేద్దామని యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు కె.విజయగౌరి అన్నారు. పట్టణంలోని తాండ్ర పాపారాయ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌టీఎఫ్ఐ (స్కూల్ టీచర్స్ ఆఫ్ ఇండియా) ఏర్పడి 25 సంవత్సరాలు అయిన సందర్భంగా శుక్రవారం జెండాను ఎగురవేశారు. ఎస్‌టీఎఫ్ఐకి అనుబంధంగా ఉన్న యూటీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నూతన సంస్కరణల పేరిట ప్రభుత్వం చేపడుతున్న విద్యారంగాన్ని నష్టపరుస్తున్నాయని విజయగౌరి అన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షులు ప్రసన్నకుమార్, జిల్లా కార్యదర్శి కేశవరావు, కె.కృష్ణదాసు, వివిధ మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు శంకరరావు, రమేష్, శ్రీనివాసరావు, సుధాకర్, రామారావు, స్వామి నాయుడు, త్రినాధరావు, వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

విశ్రాంతి భవనం ప్రారంభం

వంగర: మండల పరిధి వి.వి.ఆర్.పేట నుంచి పెద్దింపేట రహదారిలో నిర్మించిన విశ్రాంతి భవనాన్ని మిరియాల వెంకటనాయుడు మాస్టారు శుక్రవారం ప్రారంభించారు. ఆయన తల్లిదండ్రులు మిరియాల కృష్ణమూర్తినాయుడు, సూరీడమ్మల జ్ఞాపకార్థం దీన్ని నిర్మించారు. రైతులకు, బాటసారులకు, పశువుల కాపరులకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. విశ్రాంతి భవనంతో పాటు ఒక తాగునీటి బోరును ఏర్పాటు చేశామన్నారు. రూ.2.50లక్షలతో దీనిని నిర్మించినట్టు తెలిపారు.

తల్లిపాలతోనే సంపూర్ణ ఆరోగ్యం

వంగర: తల్లిపాలతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తోట మేరి అన్నారు. శుక్రవారం మండల పరిధి మరువాడలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. తల్లిపాల ఆవశ్యకతను వివరిస్తూ గ్రామంలో ర్యాలీ చేశారు. తల్లిపాలు ముద్దు–డబ్బా పాలు వద్దు....అంటూ నినదించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రూపావతి, హైమావతి, చినతల్లి, ఇందిర, ఆశా వర్కర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాలు

రేగిడి: మండలంలో పలు గ్రామాల్లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఈ కార్యక్రమాలను గ్రామాల్లోని అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, వైద్య సిబ్బంది నిర్వహించారు. బాలింతలకు తల్లి పాలు ప్రాముఖ్యతను వివరించారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

బొబ్బిలి రూరల్: ప్రస్తుత వర్షాకాలంలో ప్రమాదకర సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలున్నందును ప్రజలకు తమ పరిసరాల్లో చెత్తను నిల్వ ఉంచుకోరాదని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో పి.రవికుమార్ ప్రజలకు సూచించారు. మండలంలోని మెట్టవలస గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించారు. ఇంటింటి చెత్త సేకరణను పరిశీలించారు. ఆయనతో పాటు డిప్యూటీ ఎంపీడీవో అల్లు భాస్కరరావు, పంచాయతీ కార్యదర్శి తదితరులున్నారు.

ఆర్‌వో ప్లాంట్ బాగు చేయండి

రాజాం: స్థానిక పోలీస్‌స్టేషన్ రోడ్డు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆర్‌వో వాటర్ ప్లాంట్ మరమ్మతులకు గురైందని విద్యార్థులు తల్లిదండ్రులు ఆరోపించారు. గత రెండు నెలలుగా ఈ వాటర్ ప్లాంట్ బాగు చేయాలని కోరుతున్నా అధికారులు స్పందించడం లేదని, విద్యార్థులకు ఇబ్బందులు ఎదురౌతున్నాయని తెలిపారు. పాఠశాలలో 230 మంది విద్యార్థులు చదువుతున్నారని, వీరు ఇంటి నుంచి తాగునీటిని బాటిళ్లలో తీసుకెళ్తున్నారని అన్నారు. అధికారులు స్పందించి మూలకు చేరిన వాటర్ ప్లాంట్ వినియోగంలోకి తీసుకురావాలని కోరారు.

తల్లి పాలతోనే బిడ్డకు ఆరోగ్యం

బొబ్బిలి రూరల్: తల్లి పాలను చిన్నారులకు అందించడం ద్వారా ఆరోగ్యకరమైన శ్రేష్ఠమైన జీవితాన్ని అందించవచ్చని, రోగ నిరోధక శక్తిని పెంపొందించే అన్ని గుణాలు తల్లిపాలతోనే చిన్నారులకు లభ్యమవుతాయని ఐసీడీఎస్ సీడీపీవో విజయలక్ష్మి వివరించారు. మండలంలోని పిరిడి, కారాడ తదితర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలు, తల్లులను ఉద్దేశించి మాట్లాడుతూ తల్లి పాల విశిష్టతను వివరించారు. ఆయా కేంద్రాల్లో గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రాజు, గ్రామ సర్పంచ్‌లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, తల్లులు, గర్భిణులు పాల్గొన్నారు.

విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

రాజాం సిటీ: అనుకోని విపత్తులు జరిగే సమయంలో వాటిని సమర్థవంతంగా ఎన్‌సీసీ విద్యార్థులు ఎదుర్కోవాలని ఫైర్ ఎస్ఐ పి.అశోక్ అన్నారు. స్థానిక జీఎంఆర్ ఐటీలో జరుగుతున్న ఎన్‌సీసీ క్యాంపులో విద్యార్థులకు అగ్నిప్రమాదాల నివారణపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్‌సీసీ విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవలో తోడ్పాటునందించాలని అన్నారు. అనంతరం కమాండ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ శశాంక్‌షుహవా, ప్రదీప్‌లు మునకలవలస సమీపంలోని కొండపై నాలుగు జిల్లాల నుంచి 618 మంది కేడెట్లు పాల్గొన్న ఈ క్యాంపులో ట్రెక్కింగ్ నిర్వహించారు.

కూటమి పాలనంతా మోసం



గార్రాజు చీపురుపల్లిలో ఇంటింటికి వెళ్లి బాబు మోసాలను వివరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

రాజాం: కూటమి పాలనంతా మోసమని వైఎస్సార్‌సీపీ రాజాం రూరల్ పార్టీ అధ్యక్షుడు లావేటి రాజగోపాలనాయుడు అన్నారు. మండలంలోని గార్రాజుచీపురుపల్లి, సోపేరు గ్రామాల్లో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి కూటమి నేతల మోసాలు వివరించారు. పార్టీ రాజాం జెడ్‌పీటీసీ సభ్యులు బండి నర్సింహులు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, సర్పంచ్‌ల విభాగం కన్వీనర్ వాకముల్ల చిన్నంనాయుడు, సర్పంచ్ వంజరాపు విజయ్‌కుమార్, సోపేరు సర్పంచ్ మునగ రాము, ఎంపీటీసీ సభ్యులు పెరుమాళి చిన్నారావు, మాజీ సర్పంచ్ ముదిలి జనార్ధనరావు, యడ్ల అప్పలరాజు, పొన్నాడ తవిటినాయుడు, పొన్నాడ సన్యాసినాయుడు, గార్రాజు చీపురుపల్లి ఎంపీటీసీ సభ్యులు ధర్మాన పద్మావతి, పొన్నాడ వాసు తదితరులు పాల్గొన్నారు.

జేవీవీ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న జేవీవీ సభ్యులు

రాజాం సిటీ: జన విజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలు విజయనగరంలో సెప్టెంబర్ 13, 14తేదీల్లో నిర్వహించనున్నామని రాజాం డివిజన్ అధ్యక్షుడు గొర్లె రమేష్ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో మహాసభల పోస్టర్ శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యక్రమం విజయవంతం అయ్యేందుకు రాజాం డివిజన్‌లోని పెద్దలు ఆర్థిక, హార్దిక సహకారం అందించి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షుడు జరజాన నీలయ్య, ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్, యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహనరావు, పర్యావరణ పరిరక్షణ సమితి కన్వీనర్ ఆర్‌వీజే నాయుడు, జేవీవీ సభ్యులు వెంకటనాయుడు, రెడ్ క్రాస్ సభ్యులు పెంకి చైతన్యకుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.